సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024



చదువు సాగేదెలా?
రాజంపేట బాలికల ఉన్నత పాఠశాలలో సరిపడా తరగతి గదులు లేక విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు.
- 9లో ▸



రుణాలు మాఫీ చేయాలి
ప్రభుత్వం షరతులు లేకుండా పంట రుణాలను మాఫీ చేయాలని సింగిల్ విండోల పాలకవర్గాలు తీర్మానించాయి.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
36.4 /21.8

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ తేలికపాటి వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. రాత్రి వేళ చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నిజాంసాగర్‌లోకి 24,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: సింగూరు ప్రాజెక్టు గేట్లను ఎత్తడంతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం 24,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటిపారుదల శాఖ ఏఈ శివప్రసాద్ తెలిపారు. దీంతో ప్రాజెక్టు మూడు గేట్లను ఎత్తి అంతే నీటిని మంజీర నదిలోకి విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగుల(17.8 టీఎంసీలు)తో నిండుకుండలా ఉందన్నారు.

జిల్లాకు రూ. 6.53 కోట్ల నిధులు మంజూరు

కామారెడ్డిక్రైం: జిల్లాకు స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ ద్వారా రూ. 6.53 కోట్లు మంజూరయ్యాయని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛదనం –పచ్చదనం కోసం రూ. 2.76 కోట్లు, మల్టీపర్పస్ వర్కర్స్ 1,982 మంది వేతనాల కోసం రూ.1.99 కోట్లు, ట్రాక్టర్ ఈఎంఐలకు రూ. 19.73 లక్షలు, ఇతర అవసరాలకు మరో రూ.1.57 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. నిధులను పంచాయతీల స్టేట్ ఫైనాన్షియల్ ఫండ్ అకౌంట్‌లలో జమ చేశామని తెలిపారు.

జిల్లాస్థాయి ఖోఖో పోటీలు



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో శనివారం జిల్లా స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించారు. అండర్–17 బాలుర విభాగంలో మద్నూర్ జోన్ జట్టు ప్రథమ స్థానంలో, ఎల్లారెడ్డి జోన్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో పిట్లం జోన్ ప్రథమ స్థానం, సదాశివనగర్ ద్వితీయ స్థానం దక్కించుకున్నాయి. అండర్–14 బాలుర విభాగంలో ఎల్లారెడ్డి ప్రథమ, పిట్లం ద్వితీయ, బాలికల విభాగంలో సదాశివనగర్ ప్రథమ, కామారెడ్డి జోన్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. పోటీల్లో 32 జట్లు పాల్గొన్నాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరహరి, ఉపాధ్యాయులు రాజు, స్వామిగౌడ్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

'సమాజాభివృద్ధికి కృషిచేయాలి'



భిక్కనూరు : అధ్యాపకులు, ఉపాధ్యాయులు విద్యాభివృద్ధితో పాటు సమాజాభివృద్ధికి కృషిచేయాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి సూచించారు. శనివారం భిక్కనూరులోని వర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకున్న ప్రిన్సిపల్ సుధాకర్‌గౌడ్‌ను అసిస్టెంట్ ప్రొఫెసర్లు, కాంట్రాక్టు, పార్ట్‌టైం అధ్యాపకులు సన్మానించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ సుధాకర్‌గౌడ్‌కు అవార్డు రావడం తెయూకే గర్వకారణమన్నారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ఆదర్శవంతులుగా తయారుచేయాలని సూచించారు. తన స్టూడెంట్ అయిన సుధాకర్‌గౌడ్ రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికై నందుకు గర్వంగా ఉందని రిటైర్డు ప్రొఫెసర్ కమలాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వరి, అధ్యాపకులు మోహన్‌బాబు, నారాయణగుప్తా, వైశాలి, సరిత, సునిత, హరిత, ప్రతిజ్ఞ, వీరభద్రం, రమాదేవి, నాగేశ్వర్‌రావు, నిరంజన్ పాల్గొన్నారు.



నలుగురితో నాలుగడుగులు!

- నడకకు పెరిగిన ప్రాధాన్యత
- ఒత్తిడిని అధిగమించే ప్రయత్నం
- ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్న జనం

ఉరుకులు, పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ ఒత్తిళ్లకు లోనవుతున్నారు. చదువులతో విద్యార్థులు, పోటీ పరీక్షలలో నిరుద్యోగి, విధి నిర్వహణలో ఉద్యోగి, ఇంటి పనులతో గృహిణి, లావాదేవీల విషయంలో వ్యాపారి.. ఇలా అన్ని వర్గాల వారు నిత్యం ఒత్తిడితో చిత్తవుతున్నారు. ఈ ఒత్తిడితో చాలామంది అనారోగ్యాలకు గురవుతున్నారు. దీంతో ఆరోగ్యం కోసం వైద్యుల సూచన మేరకు జనం నిత్యం ఉభయ సంధ్య వేళల్లో నాలుగడుగులు వేస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : నడక ఉపయోగాలు తెలియడంతో చాలామంది వాకింగ్‌కు సమయం కేటాయిస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో కొంత దూరం నడుస్తున్నారు. జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన రాశివనం, కాలేజీ గ్రౌండ్‌తో పాటు ఇందిరాగాంధీ స్టేడియంలో నిత్యం ఉదయం, సాయంత్రం వందలాది మంది వాకింగ్ చేస్తుంటారు. కొత్త బస్టాండ్ నుంచి టేక్రియాల్ వరకు రహదారిపై, అలాగే రైల్వే స్టేషన్‌లో, సిరిసిల్ల రోడ్డులోని వాగు వరకు, దేవునిపల్లి నుంచి కృష్ణాజీవాడీ వరకు, నిజాంసాగర్ చౌరస్తా నుంచి పాతరాజంపేట వరకు, రైల్వే గేట్ నుంచి అడ్లూర్ బైపాస్ వరకు, కలెక్టరేట్ రోడ్డులో, అశోక్‌నగర్ నుంచి ఇల్చిపూర్ వరకు... ఇలా పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో వేలాది మంది నడక సాగిస్తుంటారు. సాయంత్రం అయితే వాకర్స్‌తో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గ్రౌండ్ కిక్కిరిసిపోతుంది. మహిళలు చాలామంది సాయంత్రం వాకింగ్‌కు ప్రాధాన్యతనిస్తున్నారు. ఉదయం పనుల్లో బిజీగా ఉండడం వల్ల సాయంత్రం వాకింగ్ చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోనే కాకుండా బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణాల్లోనూ చాలా మంది వాకింగ్‌కు ప్రాధాన్యమిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉంటున్న వారు కూడా రోజూ వాకింగ్‌ను దినచర్యలో భాగం చేసుకుంటున్నారు.

సండే స్పెషల్

యోగా, వ్యాయామాలూ..

ఒత్తిళ్లతో అనేక రకాల అనారోగ్య సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారిస్తున్నారు. దీంతో వాకింగ్, జాగింగ్‌కు వెళ్లేవారి సంఖ్య పెరుగుతోంది. యోగా కేంద్రాలూ కిక్కిరిసిపోతున్నాయి. వ్యాయామం కోసం కొందరు షటిల్, వాలీబాల్ వంటి ఆటలు ఆడుతున్నారు. కామారెడ్డి పెద్ద చెరువు, అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువుల్లో ఈతకూ వెళ్తున్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా చెమటోడుస్తున్నారు. వాకింగ్, స్విమ్మింగ్‌లతో బీపీ, షుగర్ వంటి సమస్యలు అదుపులోకి వస్తున్నాయని చాలామంది నమ్ముతున్నారు.



వర్షం పడితే గొడుగు పట్టుకుని వస్తాం



డాక్టర్లు ఇచ్చిన సలహాతో రోజూ ఇద్దరం కలిసి వాకింగ్‌కు వస్తున్నాం. వర్షం పడినా నడక మానం. గొడుగు పట్టుకుని మరీ వస్తాం. భారీ వర్షం కురిస్తే ఇంటి వద్ద నడుస్తాం. నడవడం వల్ల మానసికంగా, శారీరకంగా ప్రశాంతంగా ఉంటున్నాం.

– ఉమారాణి, సంగన్న దంపతులు, కామారెడ్డి

అడుగులతో ఆరోగ్యం..



నలుగురితో కలిసి నడవడం వల్ల ఎంతో ఉల్లాసంగా ఉంటుంది. అందరం కలిసి నడుస్తూ నాలుగు విషయాలు మాట్లాడుకుంటాం. నడక ప్రయోజనం తెలిసిన వారంతా రెగ్యులర్‌గా వస్తున్నారు.

– రాజమౌళి, స్వర్ణకారుడు, కామారెడ్డి

నడకతో ఉల్లాసం...



రోజూ వాకింగ్ చేస్తే ఎంతో ఉల్లాసంగా ఉంటుంది. ఏదేని పరిస్థితుల్లో నడవలేకపోతే ఆ రోజు ఏదో కోల్పోయిన ఫీలింగ్ కలుగుతుంది. అందుకే రోజూ తప్పనిసరిగా వాకింగ్‌కు వెళ్తుంటా. గంట పాటు నడిచి, కాసేపు ఆసనాలు వేస్తా.

– హన్మండ్లు, వ్యాపారి, కామారెడ్డి

దినచర్యలో భాగమైంది



వాకింగ్ దినచర్యలో భాగమైంది. ఏడేళ్లుగా రోజూ రాశివనంలో వాకింగ్ చేస్తున్నా. రోజూ వందలాది మంది గుంపులు గుంపులుగా నడుస్తుంటారు. ఆహ్లాదకర వాతావరణంలో నడవడం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటోంది.

– మ్యాదం లింగం, వ్యాపారి, కామారెడ్డి

రోజూ నాలుగైదు కిలోమీటర్లు నడుస్తా



చాలా ఏళ్లుగా నేను వాకింగ్ చేస్తున్నాను. రోజూ నాలుగైదు కిలోమీటర్లకుపైగానే నడుస్తా. వర్షం పడినా, చలి పెట్టినా నడక మాత్రం ఆపను. నిత్యం వాకింగ్ చేయడం వల్ల ఎంతో ఉల్లాసంగా ఉంటుంది. ఒత్తిడి దూరమవుతుంది.

– శివప్రసాద్, టీచర్, కామారెడ్డి

ఎక్కడున్నా వాకింగ్ ఆపను



క్రమం తప్పకుండా నడుస్తున్నాను. మా బృందంలో అందరం తప్పనిసరిగా వాకింగ్‌కు వస్తాం. నడవడం వల్ల ఆరోగ్య సమస్యలు ఎన్నో దూరమయ్యాయి. పనులమీద వేరే ఊళ్లకు వెళ్లాల్సి వస్తే అక్కడే వాకింగ్ చేస్తాం.

– రామ్మోహన్, మాజీ కౌన్సిలర్, కామారెడ్డి

తప్పనిసరిగా నడుస్తాం..



నడక ఆరోగ్యానికి ఎంత అవసరమో తెలిసిన వాళ్లం.. రోజూ తప్పనిసరిగా కనీసం గంటసేపైనా నడుస్తాం. ఎన్ని పనులు ఉన్నా సరే పొద్దున కచ్చితంగా వాకింగ్‌కు వచ్చి చెమటోడుస్తాం.

– లక్ష్మీనర్సింలు, కామారెడ్డి

రాజీ ద్వారా ఇరుపక్షాలకు మేలు

- జిల్లా జడ్జి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్
- జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లావ్యాప్తంగా 3,031 కేసుల పరిష్కారం

కామారెడ్డి క్రైం: రాజీమార్గం ద్వారా ఇరు పక్షాలకు మేలు జరుగుతుందని జిల్లా జడ్జి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ పేర్కొన్నారు. పగలు, ప్రతీకారాలకు పోకుండా రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లావ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కామారెడ్డి కోర్టు భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకుంటే స్నేహపూర్వక వాతావరణం ఉంటుందన్నారు. భూ, కుటుంబ తగాదాలు, చెక్ బౌన్స్ కేసులు, రాజీ కుదుర్చుకోదగిన ఇతర కేసులను జాతీయ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఒకసారి లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకున్న కేసు విషయంలో మళ్లీ ఉన్నత న్యాయ స్థానాలను ఆశ్రయించడానికి అవకాశం లేదన్నారు. ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువగా వెలుగులోకి వస్తున్నాయని, వాటి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



కామారెడ్డి కోర్టులో కేసును పరిష్కరిస్తున్న న్యాయమూర్తులు

జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో జాతీయ లోక్ అదాలత్ ద్వారా 3,031 కేసులను పరిష్కరించామని న్యాయ సేవాధికార సంస్థ సూపరింటెండెంట్ చంద్రసేన్‌రెడ్డి తెలిపారు. రోడ్డు ప్రమాదాల కేసులకు సంబంధించి బాధిత కుటుంబాలకు రూ.92.45 లక్షల పరిహారం అందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి లాల్‌సింగ్ నాయక్, సీనియర్ సివిల్ జడ్జ్ నాగరాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్, మొబైల్ కోర్టు న్యాయమూర్తి దీక్ష, ఎస్పీ సింధు శర్మ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, పీపీలు కృష్ణవేణి, రాజగోపాల్ గౌడ్, దామోదర్‌రెడ్డి, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

ఈసారైనా చర్యలు తీసుకునేనా?

- యథేచ్ఛగా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్న ప్రైవేట్ ఆస్పత్రి
- ఇప్పటికే రెండుసార్లు సీజ్.. అయినా మారని తీరు
- ఘటనపై డీహెచ్‌కు నివేదించిన వైద్యారోగ్య శాఖ



కామారెడ్డి టౌన్: లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యలు, శిశు విక్రయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఆస్పత్రిపై ఈసారైనా కఠిన చర్యలు తీసుకుంటారా అన్న అంశం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలోగల కౌసల్య ఆస్పత్రిలో లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు జరుగుతున్నట్లు 2021 సంవత్సరంలో ఫిర్యాదులు వచ్చాయి. దీంతో వైద్యారోగ్య శాఖ అధికారులు విచారణ జరిపి ఆస్పత్రిని, స్కానింగ్ యంత్రాన్ని సీజ్ చేశారు. కొన్నాళ్ల తర్వాత ఇదే యజమాన్యం అదే కాలనీలో కొత్త భవనాన్ని నిర్మించి, సమన్విత పేరుతో మరో ఆస్పత్రిని ప్రారంభించింది. ఈ ఆస్పత్రిలో శిశువును విక్రయించినట్లు ఫిర్యాదు రావడంతో ఈ ఏడాది జూలై 7న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మరోసారి ఆస్పత్రిని సీజ్ చేశారు. నిర్వాహకులు కోర్టు నుంచి స్టే తెచ్చుకుని మళ్లీ ఆస్పత్రిని కొనసాగిస్తున్నారు. అయితే ఇటీవల మహారాష్ట్రలోని లాతూర్ జిల్లా ఉద్గీర్ ప్రాంతానికి చెందిన ఓ గర్భిణీకి లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం.. ఆమె మహారాష్ట్రకు వెళ్లి అబార్షన్ చేయించుకున్న విషయం వెలుగులోకి రావడంతో ఉద్గీర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. శుక్రవారం సమన్విత ఆస్పత్రికి వచ్చి వైద్యుడిని అరెస్టు చేసి వెంట తీసుకువెళ్లారు. ఇలా ఆస్పత్రిలో వరుసగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నా.. యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో వీరి దందాకు అడ్డుకట్ట పడడం లేదు. గతంలో ఈ ఆస్పత్రిలో జరిగిన లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యలు, శిశువుల విక్రయంలాంటి ఘటనలకు సంబంధించి రాష్ట్ర అధికారులకు నివేదించినా అప్పట్లో చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఈసారైనా చర్యలు తీసుకుంటారా లేక చూసీచూడనట్లు వదిలేస్తారా అన్న అంశంపై చర్చ నడుస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి సదరు వైద్యుడితో పాటు ఆస్పత్రి నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ వ్యవహారంలో ఐఎంఏ సైతం జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

వైద్యుడికి మెమో.. ఆస్పత్రికి నోటీసులు..

లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన కేసులో మహారాష్ట్ర పోలీసుల అదుపులో ఉన్న గాంధారి సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, జిల్లా కేంద్రంలోని సమన్విత ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుడు ప్రవీణ్‌కు వైద్యారోగ్య శాఖ మెమో జారీ చేసింది. సదరు వైద్యుడికి మెమో ఇవ్వడంతోపాటు లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన సమన్విత ఆస్పత్రికి నోటీసులు ఇచ్చామని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ తెలిపారు. రెండు రోజుల్లో పూర్తి వివరణ ఇవ్వాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అధికారికి నివేదిక సమర్పించామన్నారు.

అతివలే అధికం!

- గ్రామ పంచాయతీ ఓటర్ల తుది జాబితా విడుదల
- 535 జీపీల్లో 6,36,362 మంది ఓటర్లు
- మహిళలు 3,29,787, పురుషులు 3,06,560 మంది

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలు–2024 నిర్వహించడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధికారి అనుమతితో పంచాయతీ అధికారులు తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. జిల్లాలో 535 గ్రామ పంచాయతీలలో 6,36,362 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 3,29,787 మంది మహిళలు, 3,06,560 మంది పురుషులు ఓటర్లుగా నమోదయ్యారు. ఇతరులు 15 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. అన్ని గ్రామ పంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో ఓటరు జాబితాలను విడుదల చేశారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాస్ ఆయా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

మండలాల వారీగా ఓటర్లు..

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
బాన్సువాడ	13,891	15,035	02	28,928
భిక్కనూరు	18,311	19,926	02	38,239
బీబీపేట్	9,940	10,679	00	20,619
బిచ్కుంద	19,661	20,492	05	40,158
బీర్కూర్	9,360	10,472	00	19,832
దోమకొండ	11,278	12,650	00	23,928
గాంధారి	19,489	19,929	00	39,418
జుక్కల్	17,945	18,050	00	35,995
కామారెడ్డి	8,651	9,637	00	18,288
లింగంపేట్	17,939	19,263	01	37,203

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
మాచారెడ్డి	16,655	18,432	01	35,088
మద్నూర్	22,917	23,052	00	45,969
నాగిరెడ్డిపేట్	11,770	13,426	00	25,196
నస్రుల్లాబాద్	9,752	11,075	00	20,827
నిజాంసాగర్	13,160	14,711	01	27,872
పెద్దకొడప్‌గల్	8,048	8,114	01	16,163
పిట్లం	16,835	17,849	02	34,686
రాజంపేట్	10,569	11,437	00	22,006
రామారెడ్డి	13,090	14,505	00	27,595
సదాశివనగర్	15,577	16,848	00	32,425
తాడ్వాయి	12,087	13,486	00	25,573
ఎల్లారెడ్డి	9,635	10,719	00	20,354
మొత్తం	3,06,560	3,29,787	15	6,36,362



'రేబిస్‌పై అవగాహన కలిగి ఉండాలి'



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: రేబిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ప్రపంచ రేబిస్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రేబిస్ ప్రాణాంతక వ్యాధి అన్నారు. కుక్క కాటుకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కుక్క కరిచిన వెంటనే గాయమైన ప్రదేశంలో శుభ్రమైన నీటితో కడగాలని, వెంటనే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధక అధికారి రాజేశ్వర్, డీఆర్‌డీవో సురేందర్, సీపీవో రాజారాం, డీపీవో శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

కామారెడ్డి క్రైం: రక్తదానం చేసి మరొకరి ప్రాణాన్ని కాపాడడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పిలుపునిచ్చారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదాన శిబిరాలను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. ఆరోగ్యంగా ఉన్న ఎవరైనా రక్తదానం చేయవచ్చన్నారు. ఈ శిబిరంలో 35 యూనిట్‌ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌డీవో సురేందర్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు రాజన్న, ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చింతల పోశవ్వకు ఎక్సలెన్స్ అవార్డు



కామారెడ్డి టౌన్ : స్వదేశీ జాగరణ మంచ్, స్వావలంబి భారత్ అభియాన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శనివారం జరిగిన అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమంలో జిల్లా కేంద్రానికి చెందిన దివ్య హస్తం ట్రస్ట్ నిర్వాహకురాలు చింతల పోశవ్వ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. గో ఆధారిత ఉత్పత్తులను తయారు చేయడంతో పాటు, మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వడం కృషి చేయడంపై ఈ అవార్డును డీఆర్‌డీవో డైరెక్టర్ సతీష్‌రెడ్డి, చేవేళ్ల నియోజకవర్గం ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



దోమకొండ : మహిళలు ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా మహిళా సంఘాలు పనిచేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అదనపు అధికారి మురళీకృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో 17వ వార్షిక సభ సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో ఐకేపీ ఏపీఎం రాజు, సీసీ రామకృష్ణ, అకౌంటెంట్ స్వాతి, గ్రామ సంఘాల అధ్యక్షుడు పాల్గొన్నారు.

నరేంద్రాచార్య మహరాజ్‌ను దర్శించుకున్న భక్తులు



నిజాంసాగర్(జుక్కల్) : తెలంగాణ ఉప పీఠం నరేంద్రాచార్య మహరాజ్‌ను శనివారం భక్తులు వేలాది మంది దర్శించుకున్నారు. జుక్కల్ మండలంలోని దోస్త్‌పల్లి గ్రామంలోని ఆశ్రమంలో స్వామిజీ మార్గదర్శనకు కర్ణాటక, మహరాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల భక్తులు తరలి వచ్చారు. మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ సింధే వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ పాటిల్, వెంకట్రావ్ పాటిల్, శివరాజ్ పాటిల్ తదితరులున్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు



భిక్కనూరు : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో జీపీ సిబ్బందికి పారిశుధ్య కార్మికులకు భిక్కనూరు పీహెచ్‌సీ వైద్యురాలు పూజ ఆధ్వర్యంలో శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. పారిశుధ్య కార్మికులందరికీ రక్తపోటు, మధుమేహ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఏఎన్ఎంలు, శ్యామల, హేమలత, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ ఎంపిక పోటీలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి



రెజ్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మోపాల్: కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలను ప్రోత్సహిస్తున్నారని, గ్రామీణ ప్రాంత యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడి పేర్కొన్నారు. మోపాల్ మండలంలోని మంచిప్ప జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రెజ్లింగ్ అండర్-14, 17 బాలుర, బాలికల ఎంపిక పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అదేవిధంగా మంచిప్ప పాఠశాలలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20లక్షలతో మరుగుదొడ్లు, మూత్రశాలలు, వంటగది నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అదే విధంగా సేవాలాల్ విగ్రహ ఏర్పాటు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డికి క్రీడలపై ఆసక్తి మక్కువ అని, అందుకే స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో ఒలింపిక్స్, ఇతర అంతర్జాతీయ పోటీల్లో మన రాష్ట్రం నుంచి క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు, కాంస్య, రజత పతకాలు సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. క్రీడలతో మానసిక, శారీరక ధృడత్వం, ఉల్లాసం కలుగుతుందని అన్నారు.

250 మంది క్రీడాకారులు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రెజ్లింగ్ పోటీల్లో 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పీఈటీలు సంతోషి, దేవేందర్ ఆధ్వర్యంలో పోటీలు కొనసాగాయి. ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నాగమణి, ఎంఈవో గేమ్‌సింగ్, ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రీ సర్వే కోసం కమిటీ ఏర్పాటు

మంచిప్ప రిజర్వాయర్ ముంపు రీ సర్వే కోసం నిపుణులు, ఇంజినీర్లతో ప్రత్యేక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. పాత డిజైన్ ప్రకారమే పనులు చేపడతామని, ప్రస్తుతం చేపడుతున్న పనులను పరిశీలించి కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇస్తుందన్నారు. రీ సర్వే కమిటీకి ప్రజలు సహకరించాలని కోరారు. కేవలం కమీషన్ల కోసమే మాజీ సీఎం కేసీఆర్ ప్రాజెక్ట్‌ను రీ డిజైన్ చేశారని ఆరోపించారు. ప్రాజెక్ట్ ప్రస్తుత పరిస్థితిని సీడబ్ల్యూసీ కమిటీ మెంబర్ శ్రీరామ్‌కు వివరాలు పంపించామని, త్వరలో ఆయన ప్రాజెక్టును సందర్శిస్తారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాత డిజైన్ పనులు చేపట్టే విషయంలో సానుకూలంగా ఉన్నారని అన్నారు. 70శాతం పనులు పూర్తయ్యాయని, త్వరలో మిగతా 30శాతం పనులు పూర్తి చేస్తామన్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లు అధికంగా కేటాయిస్తామని, మహిళా సంఘం భవనం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్, మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి, నాయకులు, ప్రజాప్రతినిధులు మోహన్‌రెడ్డి, గొర్కంటి లింగం, ప్రతాప్‌సింగ్, కెతావత్ మోహన్ నాయక్, రాజేశ్, గోపూరు నరేశ్‌రెడ్డి, దేవ శంకర్, ఈశ్వర్‌సింగ్, సత్యనారాయణ, సాయిరాం, మహేశ్, ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కళాశాలలో పరిసరాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శనివారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సందర్శించారు. ప్రిన్సిపాల్ అశోక్ అడిగి సమస్యలు తెసుకున్నారు. పరిసరాలు పరిశీలించి పిచ్చిమొక్కలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులు, తరగతి వివరాలు తెలుసుకున్నారు. కళాశాలలో శుభ్రత పాటించడం, మొక్కలు నాటి పరిసరాల పచ్చదనంతో మంచి వాతావరణం ఉందని, కళాశాల న్యాక్‌లో ఏ గ్రేడ్ సాధించి స్వయం ప్రతిపత్తి హోదాను పొందడాన్ని సబ్ కలెక్టర్ అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశం, లెక్చరర్లు ఉన్నారు. బీసీ బాలుర హాస్టల్ కోసం బిచ్కుంద శివారులో సబ్ కలెక్టర్ స్థలం పరిశీలించారు. శివారులో ఉన్న ఎకరం భూమిని పరిశీలించారు. తహసిల్దార్ సురేశ్ పాల్గొన్నారు.

బీసీ గురుకుల పాఠశాల తనిఖీ

బాన్సువాడ : బీర్కూర్‌లోని బీసీ గురుకుల పాఠశాల, ఉన్నత పాఠశాలను శనివారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సందర్శించారు. బీసీ గురుకుల పాఠశాలలో టీచర్ల రికార్డులు, విద్యార్థుల రిజిస్టర్లు పరిశీలించారు. భోజన మెనూను తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం వివరాలు తెలుసుకున్నారు. జీపీ కార్యదర్శి గంగాధర్ తదితరులు ఉన్నారు.

ముగిసిన అంతర పాఠశాలల క్రీడలు



గాంధారి (ఎల్లారెడ్డి) : మండలస్థాయి అంతర పాఠశాలల క్రీడాపోటీల్లో పేట్‌సంగెం జెడ్పీ ఉన్నత పాఠశాల చాంపియన్ నిలిచినట్లు పీఈటీ లక్ష్మణ్ తెలిపారు. పేట్‌సంగెం జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో రెండ్రోజుల పాటు మండల పాఠశాలల క్రీడా పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్‌లో బాలబాలికలకు అండర్-14, 17 పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

5న మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం



భిక్కనూరు : భిక్కనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం 5న జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ పాలకవర్గ సభ్యులకు సమాచారం అందించారు. ఇటీవల ప్రభుత్వం భిక్కనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ప్రకటించింది. అధ్యక్షుడిగా జనగామకు చెందిన పాత రాజు, ఉపాధ్యక్షుడిగా భిక్కనూరు మండలం పెద్ద మల్లారెడ్డి గ్రామానికి చెందిన టెంట్ హౌస్ స్వామిని నియమించారు. మార్కెట్ కమిటీ పరిధిలో భిక్కనూరు, దోమకొండ, రాజంపేట, బీబీపేట మండలాలకు చెందిన పలువురిని పాలకవర్గ సభ్యులుగా నియమించారు. షబ్బీర్ వచ్చేనెల 5న ప్రమాణ స్వీకారం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమానికి షబ్బీర్ అలీ హాజరు కానున్నారు.

కబడ్డీ పోటీల్లో లచ్చాపేట విద్యార్థుల ప్రతిభ



మాచారెడ్డి : పాఠశాల క్రీడల్లో భాగంగా పాల్వంచ మండలంలోని ఫరీదుపేటలో జరిగిన కబడ్డీ జిల్లాస్థాయి పోటీల్లో లచ్చాపేట పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. నిఖిత, ఫౌజియా, కీర్తన, నితీష జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. పాఠశాల హెచ్ఎం లక్కిరెడ్డి రాజేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు లింగారెడ్డి, అఖిల్ హుస్సేన్ తదితరులున్నారు.

లోక్ అదాలత్ విజయవంతం



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న జడ్జి హారిక

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టులో న్యాయమూర్తి హారిక జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోదగ్గ కేసులకు సంబంధించిన కేసులను న్యాయమూర్తి ఇరువర్గాలు రాజీ పడడంతో వాటిని పరిష్కరించినట్లు కోర్టు సిబ్బంది తెలిపాయి. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు నవీద్, న్యాయవాదులు పండరి, శ్రీనివాస్, గోపాల్‌రావు తదితరులున్నారు.

బాన్సువాడ : జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం బాన్సువాడ జూనియర్ సివిల్ జడ్జి టీఎస్‌పీ భార్గవి ఆధ్వర్యంలో 310 కేసులను రాజీ చేశారు. బార్ అసోసియేషన్ ప్రసిడెంట్ లక్ష్మీనారాయణ మూర్తి, ఏజీపీ ఖలీల్, అడ్వకేట్స్ మోహన్‌రెడ్డి, మోగులయ్య, అనంద్, బాలరాజు ఉన్నారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై కళాజాత



దోమకొండ : మండల కేంద్రంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాత్రి హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్లు శివరాం, బాల్ కిషన్, నందిని బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో తాత్కాలిక రేకుల షెడ్డు నిర్మాణం



బాన్సువాడ ఆస్పత్రిలో రేకుల షెడ్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ సలహాదారు పోచారం

బాన్సువాడ : బాన్సువాడ మాతా శిశు సంరక్షణ ఆస్పత్రి ఆవరణలో తాత్కాలిక రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ఆస్పత్రిని సందర్శించారు. ఏరియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణం చేపడుతున్నందున అప్పటి వరకు మాతా శిశు సంరక్షణ ఆస్పత్రి ఆవరణలో తాత్కాలికంగా రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టి వైద్య సేవలందిస్తామన్నారు. షెడ్‌కు సంబంధించి సూపరింటెండెంట్ విజయలక్ష్మికి సలహాలు, సూచనలు ఇచ్చారు. బీ ర్కూర్ మండలం తిమ్మాపూర్ వెంకటేశ్వర ఆలయాన్ని సందర్శించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు నార్ల సురేష్, కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, ఎజాస్, నర్సగొండ తదితరులు ఉన్నారు.

భారతీయ కిసాన్ సంఘ్ కార్యవర్గాల ఏర్పాటు



అడ్లూర్ ఎల్లారెడ్డిలో నూతన కార్యవర్గ సభ్యులు



సదాశివనగర్‌లో ఎన్నికైన నూతన కార్యవర్గం

జిల్లాలోని ఆయా మండలాల్లో శనివారం భారతీయ కిసాన్ సంఘ్ నూతన కార్యవర్గాల ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన సభ్యులు మాట్లాడుతూ రైతుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామన్నారు. – సాక్షి నెట్‌వర్క్



భిక్కనూరులో మాట్లాడుతున్న సంఘ్ ప్రతినిధి



ఉప్పల్‌వాయి గ్రామంలో..



నాగిరెడ్డిపేటలో మాట్లాడుతున్న రాజాగౌడ్



భిక్కనూరులో కార్యవర్గ సభ్యుల నినాదాలు

సంక్షిప్తం

అధికారులు అందుబాటులో ఉండాలి



మద్నూర్(జుక్కల్) : అధికారులు సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యలయాన్ని శనివారం సబ్ కలెక్టర్ సందర్శించారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. అనంతరం మండల వీఆర్ఎలు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఎలను రెగ్యులర్ చేస్తూ కారుణ్య నియమకాల కోసం జీవో విడుదల చేసిందన్నారు. గత పదేళ్లుగా 61 ఏళ్లు దాటిన వీఆర్ఎల వారసులకు జీవో 81, 85 ప్రకారం నియామక ఉత్తర్వులు ఇప్పించాలని వారు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఉల్లాజీ, రమేశ్, హన్మాండ్లు, తానాజీ తదితరులున్నారు.

అందరికీ న్యాయం జరిగేలా చూస్తాం



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : లబ్ధిదారులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని తహసీల్దార్ రహీమొద్దీన్, ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని చిట్యాలలో సోమవారం గ్రామ సభను ఏర్పాటు చేసి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామ శివారులో ఉన్న 156, 181 సర్వే నంబరులో భూమిలో 20ఏళ్ల క్రితం కొంతమంది లబ్ధిదారులకు పట్టాలు అందజేసిందన్నారు. కాని లబ్ధిదారులతో గ్రామంలో కొందరికి తరచూ గొడవలు జరుగుతున్నాయన్నారు. దీంతో లబ్ధిదారులు ఫిర్యాదు మేరకు ఎస్సై, తహసీల్దార్‌లు గ్రామంలో సభలో మాట్లాడారు. పై అధికారులకు సమాచారం ఇచ్చామని పరిష్కారమయ్యే వరకు ఎవరూ గొడవలకు దిగొద్దన్నారు. ఎవరూ ఆ భూమిలో పనలు చేయవద్దన్నారు.

గడీకోట ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



దోమకొండ : మండల కేంద్రంలో గడీకోట ట్రస్టు భవనంలో శనివానం కామారెడ్డి శ్రీరామ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. గైనకాలజిస్ట్ డాక్టర్ రవళి, ఆర్థోపెడిక్స్‌వైద్యులు రాకేష్, తదితరులు 250 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. గడీకోట ట్రస్ట్ సీనియర్ మేనేజర్ బాబ్జీ, మాజీ జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆడం శంకర్ రెడ్డి, పట్టణఅధ్యక్షుడు సీతారాం మధు, పాల్గొన్నారు

క్యాసంపల్లి ప్రభుత్వ బడికి ఆర్థికసాయం

కామారెడ్డి రూరల్ : ఉన్నత స్థాయిలో ఉన్నవారందరూ సర్కార్ బడిలోనే చదవి దేశానికి సేవలు అందిస్తున్నారని సైంటిస్ట్ పైడి ఎల్లారెడ్డి అన్నారు. శనివారం కామారెడ్డి మండలం క్యాసంపల్లి తండాలోని ప్రాథమిక పాఠశాల మౌలిక వసతుల కల్పనకు రూ. 50 వేలు అందజేశారు. పైడి ఎల్లారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందించడం ద్వారా నిరుపేదలకు మేలు జరుగుతుందన్నారు. తను కూడా ఒక ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థినేనన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నర్సింగ్ రావు, సర్పంచ్ నారాయణ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మామిండ్ల అంజయ్య, నాగిరెడ్డిపేట్ మాజీ ఎంపీపీ రాజుదాస్, పాల్గొన్నారు.

బతుకమ్మ పండుగ కోసం ఏర్పాట్లు



బీబీపేట : వచ్చే నెల 2వ తేదీ నుంచి ప్రారంభమయ్యే బతుకమ్మ పండుగ కోసం శనివారం మండల కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకాధికారి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో చెరువు వద్ద ముళ్ల పొదలను జేసీబీ సాయంతో తీసివేశారు. అంతేకాకుండా అక్కడ మొరం పోయించి చదును చేయించారు. ఈ ఏడాది చెరువు పూర్తిగా నిండడంతో ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎక్కువ ఖాళీ స్థలం ఏర్పాటు చేసి మహిళలకు ఇబ్బందులు కలుగకుండా చేశామని పవన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రమేష్, కారోబార్ సిద్ధరాములు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలి



భిక్కనూరు : విద్యార్థులకు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు వచ్చే విధంగా ఉత్తమ విద్యాబోధన చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. శనివారం ఆయన భిక్కనూరు మండలం జంగంపల్లిలోని కస్తూర్బా పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ క్రమశిక్షణతో ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగితే విజయం సాధిస్తారన్నారు. డిజిటల్ పద్ధతుల్లో జరుగుతున్న బోధనలో ఎలాంటి ఇబ్బందు ఉంటే వెంటనే వాటి గురించి ఉపాధ్యాయులకు చెప్పాలన్నారు. తరగతి గదులను వంటగదిని భోజన శాలను పరిశీలించి క్యాంపస్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్డీవో రంగనాథ్‌రావు, జిల్లా ఎస్సీ సంక్షేమశాఖాధికారి రజిత, డీఈవో రాజు, సీఈవో చందర్‌నాయక్, పీఆర్ ఈఈ దుర్గాప్రసాద్, డిప్యూటీ ఈఈ స్వామిదాసు తదితరులున్నారు.

సీజ్ చేసిన ఇసుక వేలం

రుద్రూర్: పొతంగల్ శివారులో రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న 60 ట్రాక్టర్ల ట్రిప్పుల ఇసుకను తహసీల్ కార్యాలయంలో శనివారం వేలం నిర్వహించారు. వేలంలో పొతంగల్ గ్రామానికి చెందిన సూదం వినోద్ రూ. 66 వేలకు దక్కించుకున్నట్లు తహసీల్దార్ మల్లయ్య పేర్కొన్నారు.

టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడి

ఎల్లారెడ్డి: మండలంలోని తిమ్మాపూర్‌లో టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం దాడులు నిర్వహించినట్లు స్థానికులు తెలిపారు. గ్రామంలో నిర్వహించిన టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడిలో ఒకరి నుంచి గంజాయి, అల్ప్రాజోలం, డైజోఫాంను స్వాధీనం చేసుకోగా సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

మసీదులో మైక్ చోరీ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలోని మసీదులో మైక్ చోరీకి గురైనట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం పక్కన ఉన్న మసీదులో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి మైక్‌ను దొంగిలించినట్లు పేర్కొన్నారు. మసీదు నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ఐదుగురి మృతి

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం నాగుల్‌గావ్ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమ్మరి సాయిలు(40) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై భువనేశ్వర్ తెలిపారు. మండలంలోని పెద్దఎడ్గి గ్రామానికి చెందిన సాయిలు బైక్‌పై నాగుల్‌గావ్‌కు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో బైక్ బలంగా ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సాయిలు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య కుమ్మరి లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెట్టును లారీ ఢీకొన్న ఘటనలో డ్రైవర్..



ఇందల్వాయి: ఇందల్వాయి-ధర్పల్లి రోడ్డు మార్గంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందినట్లు ఎస్సై మనోజ్ కుమార్ శనివారం పేర్కొన్నారు. అన్సాన్‌పల్లి నుంచి ఇందల్వాయి వైపు వస్తున్న సిమెంట్ లారీ లింగాపూర్ స్టేజ్ వద్ద అదుపు తప్పి చెట్టును ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన డ్రైవర్ బిస్మిల్లా ఖాన్(35) మృతి చెందాడు. మృతుడు మంచిర్యాల జిల్లా కాశీపేట్ మండలం దేవాపూర్‌కి చెందినవాడిగా గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు..

బాన్సువాడ రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లాలోని మైదుకూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బాన్సువాడ పట్టణానికి చెందిన సయ్యద్ అహ్మదుల్లా(39) శనివారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. బాన్సువాడలోని వీక్లీ మార్కెట్‌లో నివాసం ఉండే అహ్మదుల్లా పని నిమిత్తం మైదుకూరుకు వెళ్లాడు. అక్కడ బైక్‌పై ప్రయాణిస్తుండగా టిప్పర్ ఢీకొన్నది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వద్ద దొరికిన ఆధారాల ప్రకారం అక్కడి పోలీసులు బాన్సువాడ పోలీసులకు తెలుపగా వారు కుటుంబీకులకు సమాచారం అందించారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు..

కామారెడ్డి క్రైం: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి చెందిన ఘటన కామారెడ్డి మండలం రామేశ్వర్‌పల్లి శివారులో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని బీడీ వర్కర్స్ కాలనీలో నివాసం ఉంటే కోదండం లాలూకు ఆరుగురు కుమారులు. వారిలో మూడో కుమారుడైన సారయ్య (41) శుక్రవారం సాయంత్రం తండ్రితో కలిసి చేపల వేటకు వెళ్లాడు. కొద్ది సేపటికి తండ్రి లాలూ ఇంటికి తిరిగి రాగా కుమారుడు సారయ్య చేపలు పట్టుకుని వస్తానన్నాడు. సారయ్య ఇంటికి తిరిగి రాకపోవడంతో శనివారం ఉదయం కుటుంబీకులు కుంట వద్దకు వెళ్లి గాలించగా ఆచూకీ దొరకలేదు. సాయంత్రం మృతదేహం నీటిపై తేలింది. సారయ్యకు ఫిట్స్ వ్యాధి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.

కాలువలో పడి ఒకరు..

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని తుంకిపల్లి గ్రామానికి చెందిన మెట్టు సంజీవులు(56) అనే వ్యక్తి మిషన్ భగీరథ కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మద్యానికి బానిసైన సంజీవులు మద్యం మత్తులో కాలువ పడి మృతి చెందాడన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



సాయవ్వ

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని కుర్లా గ్రామానికి చెందిన మేత్రి సాయవ్వ అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు ఎస్సై విజయ్‌కొండ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కుర్లా గ్రామానికి చెందిన మేత్రి సాయవ్వ ఈ నెల 27న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

హత్య కేసులో ఐదుగురి రిమాండ్

మోపాల్: మండలంలోని కంజర్‌లో మూడు రోజుల క్రితం జరిగిన నరహరి హత్య కేసులో ఐదుగురిని సీఐ సురేష్‌కుమార్ శనివారం రిమాండ్‌కు తరలించారు. బోయిని సత్యనారాయణ, లలిత, పూజిత, సందీప్, వంశీని రిమాండ్‌కు తరలించగా, హత్య కేసులో మరికొందరి పాత్రపై విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. నరహరి హత్యలో 15 మంది వరకు ప్రత్యక్షంగా పాల్గొన్నారని ప్రత్యక్ష సాక్షులు, మృతుడి కుమారులు ఆరోపిస్తున్నారు. వారి పాత్రపై పోలీసులు విచారణ చేపట్టి, మరికొందరిని రిమాండ్‌కు పంపించే అవకాశముందని సమాచారం.